తల్లిపాలే బిడ్డకు సంజీవని

పార్వతీపురంటౌన్: తల్లిపాలు సంజీవని వంటివని, పుట్టిన వెంటనే పిల్లలకు తల్లిపాలు అందించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. పట్టణంలోని గిరిమిత్ర సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన ప్రపంచ తల్లిపాల దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు తాగించాలని సూచించారు. తల్లిపాలలో బిడ్డకు కావాల్సిన పోషకాలు ఉంటాయన్నారు. పిల్లల ఎదుగుదలకు, వారిలో వ్యాధినిరోధకశక్తి పెరిగేందుకు తల్లిపాలు ఉపకరిస్తాయన్నారు. మనదేశంలో ఆస్పత్రి ప్రసవాలలో నలభై శాతం మంది పిల్లలకు మాత్రమే పుట్టిన వెంటనే తల్లిపాలు పడుతున్నారని, ఈ విషయంలో తల్లులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బిడ్డకు ఆరు నెలల వయసువచ్చే వరకు మెదడు పెరుగుదల ఉంటుందని, ఆ సమయంలో తల్లిపాలు చాలా అవసరమన్నారు. అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం సమకూర్చే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు సక్రమంగా అందజేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో తల్లిపాల ఆవశ్యకత, బాల్యవివాహాల నిర్మూలన, వంద రోజుల ప్రణాళిక, మానవ అక్రమ రవాణా, మహిళలపై అఘాయిత్యాలు, తదితర అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం.శోభారాణి, మహిళా శిశు సాధికారిత అధికారి ఎంఎం రాణి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి బి.శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసరు వై.విజయమోహన్, ఎంఈఓ కె.ప్రసాదరావు, హెడ్‌కానిస్టేబుల్ లావణ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మక్కువలో..

మక్కువ: మండలంలోని కాశీపట్టనం, ఎరప్రామం తవలస గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బిడ్డలకు తల్లిపాలు పట్టడం వల్ల కలిగే ప్రయోజనాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. బిడ్డకు ఆరు నెలల వయసు వచ్చే వరకు తల్లిపాలు పట్టాలని, ఇతర పానీయాలు ఇవ్వరాదని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పి.రాజశ్రీ, ఎస్.లీలావతి, తదితరులు పాల్గొన్నారు.



మక్కువ: గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



పార్వతీపురంటౌన్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

సాలూరులో..

సాలూరు: శిశువు సంపూర్ణ ఆరోగ్యానికి, పెరుగుదల, వికాసానికి తల్లిపాలు ఎంతో అవసరమని నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వేణుగోపాలరావు అన్నారు. పట్టణంలోని వైటీసీలో సంస్థ ఆధ్వర్యంలో బుధవారం తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ పీఓ సత్యవతి గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతను వివరించారు. పుట్టిన వెంటనే బిట్టకు తల్లిపాలు పెట్టడం వల్ల బిడ్డలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని, ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వైటీసీ మేనేజర్ విద్యాసాగర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సాలూరు: వైటీసీ వద్ద నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

క్లుప్తంగా

ఘనంగా మజ్జి గౌరమ్మ వారాల పండగ



అమ్మవారి ప్రభను ఊరేగిస్తున్న దృశ్యం

మక్కువ: మండల కేంద్రం మక్కువలో మజ్జి గౌరమ్మ అమ్మవారి వారాల పండగను భక్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. యువత కోలాహలం, కేరింతలు, డప్పు వాయిద్యాల సందడి మధ్య అమ్మవారి ప్రభను గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అనంతరం గ్రామం శివారు వీధిలో గద్దె వద్ద అమ్మవారికి మహిళలు కోళ్లు, చీరలు చూపించి మొక్కులు చెల్లించారు. ఏటా శ్రావణ మాసంలో స్థానిక కుమ్మరి కులస్తులు మజ్జి గౌరమ్మ అమ్మవారి వారాల పండగలు నిర్వహించడం ఆనవాయితీ.

సాలూరు-విశాఖ రైలు సర్వీసుకు ఆమోదం

సాలూరు: సాలూరు-బొబ్బిలి రైలు సర్వీసును విశాఖపట్నం వరకు పొడిగిస్తూ ఈస్ట్‌కోస్ట్ రైల్వే అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాలూరు నుంచి బొబ్బిలికి ప్రతిరోజు నాలుగు సార్లు ఎటువంటి స్టాప్‌లు లేకుండా రైలు సర్వీసు నడిపేందుకు ఆమోదం తెలిపారు. ఈమేరకు అన్ని విభాగాలు సిద్ధంగా ఉండాలని లేఖలో పేర్కొన్నారు. ఈ సేవలను ప్రారంభించే అనుకూల తేదీని తెలియజేస్తే.. తదనుగుణంగా నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు వాల్తేరు రైల్వే మేనేజర్‌కు లేఖ పంపించారు.

ఎస్ఎంసీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి



పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 శ్రీనివాసరావు

బలిజిపేట: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు సజావుగా నిర్వహించాలని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈఓ-2 కె.శ్రీనివాసరావు అన్నారు. వెంగళరాయపురం ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను, వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు, కిచెన్ గార్డెన్‌లో పండిస్తున్న పంటలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట హెచ్ఎం విజయలక్ష్మి ఉన్నారు.

కేవీకేలో కొబ్బరి మొక్కల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలంలోని రస్తాకుంటుబాయి కృషీ విజ్ఞాన కేంద్రంలో గిరిజన రైతులకు బుధవారం కొబ్బరి మొక్కలను పంపిణీ చేశారు. సెంట్రల్ ప్లాంటేషన్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కాసర్గడ్, గిరిజన ఉప ప్రణాళిక 2024-25లో భాగంగా రస్తాకుంటుబాయి కేవీకే ఆధ్వర్యంలో కొబ్బరి మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు నాబార్డ్ ఏజీఎం ఎస్.దినేష్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు 5540 కొబ్బరి మొక్కలను పార్వతీపురంలోని జట్టు ఆశ్రమం, రస్తాకుంటుబాయి కేవీకే ద్వారా గిరిజనులకు అందించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్తలు కొబ్బరి తోటల పెంపకంతో సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్వతీపురం జట్టు ఆశ్రమం నిర్వాహకులు పద్మజ, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రాజు, అమృత వీణ పాల్గొన్నారు.

సామాన్యులకు ప్రాధాన్యం

పాలకొండ రూరల్ : బీజేపీలో సామాన్య కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు అన్నారు. యువమోర్చా కార్యవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం పాలకొండలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టంకాల దుర్గారావు, పూణ్ణ పెదబాబు, జిల్లా కార్యదర్శి కె.తిరుపతిరావు, కారెపు చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

గరుగుబిల్లి: బాల్య వివాహాలు చేయడం, చేయించడం చట్టరీత్యా నేరమని ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల లో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదుస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీఓ సుగుణకుమారి బాలబాలికల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు పలు చట్టాలను అమలు చేస్తున్నాయని, వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు నిర్వహిస్తే వెంటనే చైల్డ్‌కేర్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు సమాచారం అందించాలని కోరారు.

అలసత్వం వహిస్తే మూల్యం చెల్లించక తప్పదు

• జిల్లా రవాణా శాఖ అధికారి ఎం.శశికుమార్



పార్వతీపురంటౌన్: వాహనదారులు అలసత్వం వహిస్తే మూల్యం చెల్లించక తప్పదని, ప్రతీ వాహనదారుడు నూతన వాహన చట్టం పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా రవాణా శాఖ అధికారి ఎం.శశికుమార్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. వాహనదారులకు నూతన వాహన చట్టంపై, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లాలో గత రెండేళ్లలో 18,138 వాహనాలు రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జిల్లాలోని ప్రధాన రహదారులపై ప్రతిరోజు రవాణాశాఖ అధికారులు, పోలీసులు తనిఖీలు చేపడుతున్నారన్నారు. జిల్లా కేంద్రంలోని వెంకంపేట గోరీలు, కొత్తవలస వై జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి, పాత బస్టాండ్ వద్ద, సాలూరు, పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో ప్రధాన కూడళ్ల వద్ద తనిఖీలు కొనసాగుతున్నాయన్నారు. పెండింగ్ చలాన్లు వసూలతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానా విధిస్తున్నామన్నారు. గతంలో సీటు బెల్టు, హెల్మెట్ లేకపోతే రూ.100 చలానా ఉండేదని, ఇప్పుడు అది రూ.1000లకు పెంచడంతో పాటు మూడు నెలలు లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందన్నారు. మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేలు అపరాద రుసుంతో పాటు కోర్టు విధించిన శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. ఓవర్ స్పీడ్‌తో వెళితే రూ.2 వేలు అపరాద రుసుం, మూడు నెలలు లైసెన్స్ రద్దు, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే రూ.5 వేల ఫైన్, ట్రిపుల్ రైడింగ్‌లో పట్టుబడితే రూ.2 వేలు అపరాధ రుసుంతో పాటు, కోర్టు విధించిన శిక్ష అనుభవించాల్సి వస్తుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ విధిగా రహదారి భద్రతా నియమాలు పాటించాలని కోరారు.

సచివాలయంకు చేరిన పరికరాలు



పి.చాకరాపల్లి సచివాలయంకు చేరిన పరికరాలతో సర్పంచ్ మోహనరావు

సాక్షి ఎఫెక్ట్...

బలిజిపేట: మండలంలోని పి.చాకరాపల్లి సచివాలయం నుంచి పదమాయవలస సర్పంచ్ సత్యనారాయణ తీసుకువెళ్లిన సామగ్రిని బుధవారం తిరిగి అప్పగించారు. సాక్షి పత్రికలో ఈ నెల 5న ప్రచురితమైన 'మళ్లీ సచివాలయం రగడ' కథనంపై అధికారులు స్పందించారు. సత్యనారాయణ నుంచి సామగ్రిని స్వాధీనం చేసుకుని పి.చాకరాపల్లి సర్పంచ్ మోహనరావుకు అప్పగించారు. కాగా, పి.చాకరాపల్లి సచివాలయం నుంచి 6 కుర్చీలు, ఒక కంప్యూటర్, సీపీయూ, ప్రింటర్‌ను పదమాయవలస సర్పంచ్ సత్యనారాయణ తీసుకువెళ్లిన విషయం తెలిసిందే.

ఆన్‌లైన్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు

సీతానగరం: గ్రామాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులు, అభివృద్ధి పనుల వివరాలను పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులతో సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు బహిరంగ మలవిసర్జనను పూర్తిగా నివారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, ఇంజినీరింగ్ అధికారి జి.చంద్రమౌళి పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలోని విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి తమ సంఘం కృషి చేస్తోందని ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు అన్నారు. జూలై 27న పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన 28 మంది విశ్వబ్రాహ్మణులు విజయవాడ అమ్మవారి దర్శనానికి బస్సులో వెళ్తుండగా ఏలూరు సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, పలువురు గాయాలపాలైన విషయం విధితమే. అయితే ఆ ప్రమాదంలో గాయాలపాలైన గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.గౌరీశ్వరరావును రాష్ట్ర కమిటీ సభ్యులు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంఘం ద్వారా మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. గాయపడిన వారికి పరామర్శించి ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఆ సంఘం మన్యం జిల్లా మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, తదితరులు ఉన్నారు.

బుడ్డిపేటలో 'పొలం బడి'



పొలంబడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ అవినాష్

సీతానగరం: 'పొలం బడి' కార్యక్రమం ద్వారా రైతులకు పంటలసాగుపై అవగాహన కల్పించడం జరుగుతుందని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. బుడ్డిపేటలో బుధవారం 'పొలం బడి' కార్యక్రమం నిర్వహించారు. వరిలో కలుపు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, కిచెన్ గార్డెన్ల పెంపకంపై అవగాహన కల్పించారు. వరిలో కలుపునివారణకు నాట్లు పూర్తయిన వారం రోజుల్లో ప్రిటాలోక్లోర్, పైలోపాప్ బ్యూటైల్, బుటాక్లోర్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. 15 నుంచి 20 రోజుల తరువాత 24-డీ సోడియం సాల్ట్(బిస్పోరిప్యాక్ సోడియం), పెండిమిథలిన్, తదితర రసాయనాలను పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సహాయకులు పి.లక్ష్మణ్, బి.సుధీర్, ఏపీసీఎస్ఎఫ్ గంగరాజు, నవీన్ పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేకేసీ కో ఆర్డినేటర్ ఎం. రవికిరణ్ మాట్లాడుతూ, చేనేత రంగం భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి చిహ్నమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రభాకరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చేనేత రంగం మరింత బలోపేతం కావాలి..

పాలకొండ: చేనేత రంగం మరింత బలోపేతం కావాలని ఆర్డీఓ వెంకటరమణ అన్నారు. కామన్ ఫెసిలిటీ సెంటర్ కోటదుర్గమ్మ వీవర్స్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేనేత కార్మికులు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. సొసైటీ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వీవర్స్ కాలనీకి చెందిన చేనేత కార్మికులు పాల్గొన్నారు.



పాలకొండ: చేనేత కార్మికుల పరికరాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకటరమణ

చేనేత కార్మికులకు అండగా నిలవాలి

గుమ్మలక్ష్మీపురం: చేనేత వస్త్రాలను ధరించి చేనేత కార్మికులను ఆదుకోవడంతో పాటు భారతీయత సంప్రదాయాలను కాపాడాలని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ వి.కల్పన అన్నారు. కళాశాలలో హిస్టరీ అధ్యాపకురాలు శ్రీవాణి ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. రెడీమేడ్ వస్త్రాల రాకతో చేనేత కార్మికుల జీవనం దుర్భరమైందన్నారు. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, ప్రజలపై ఉందన్నారు. నేత వస్త్రాలు ధరించడం ద్వారా నేత కార్మికులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం చేనేత వస్త్రాలను ప్రోత్సాహించేలా కళాశాల వద్ద ఫ్యాషన్ షో నిర్వహించారు.

108లో ప్రసవం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని మేదరిగండ గ్రామానికి చెందిన గర్భిణి పువ్వల హెలన్సీ బుధవారం 108 అంబులెన్స్‌లో ప్రసవించినట్లు ఈఎంటీ జెంజేటి గోపాల్, పైలట్ రామారావులు తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ హెలన్సీకి పురిటి నొప్పులు వచ్చాయని, ఆస్పత్రికి తరలించాలని ఫోన్ ద్వారా అందుకున్న సమాచారం మేరకు గ్రామం నుంచి కురుపాం సీహెచ్‌సీకి ఆమెను తీసుకువెళ్లగా, పరీక్షించిన వైద్యులు ప్రాథమిక వైద్య సేవలు అందించి మెరుగైన వైద్యం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆమెను పార్వతీపురం ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో పురిటి నొప్పులు అధికం కావడంతో అంబులెన్స్‌ను ఉల్లిభద్ర వద్ద నిలుపుదల చేసి, తగిన సపర్యలు చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చిందని తెలిపారు. అనంతరం పార్వతీపురం ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించిన తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు చెప్పారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పార్వతీపురంటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఆపరేషన్) వీవీ కిషోర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఫీడర్ నిర్వహణ, విద్యుత్ లైన్లను ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

పట్టణంలోని ఇందిర కాలనీ, రామాపురం కాలనీ, గాంధీ సత్రం, దేవినగర్, పార్వతీనగర్, చిన కుమ్మరి వీధి, రెడ్డి వీధి, గుప్త మెడికల్ సెంటర్, పార్వతీపురం టౌన్, నాయుడు వీధి, వేమకోట వీధి, పాండా వీధి, కుసుమగుడి వీధి, కంచర వీధి, గొడు వీధి, బేరి వీధి, కొసరి వీధి, పిల్ల వీధి, హరిజన వీధి, కృష్ణపల్లి ఏరియా, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

ఆదివాసీ హక్కుల రక్షణకు ఉద్యమిద్దాం..

• ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి

పార్వతీపురంటౌన్: ఆదివాసి గిరిజన హక్కుల కోసం ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక గిరిజన సామాజిక భవనంలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. శాస్త్రసాంకేతిక రంగాలు ఎంతో అభివృద్ధి చెందిన నేటి సమాజంలో గిరిజన ప్రాంతాల్లో ఉంటున్నవారికి నాణ్యమైన విద్య, వైద్య, ఉపాధి కరువైందని అన్నారు. ఆదివాసులకు విద్యను దూరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అందులో భాగంగానే 117 జీవో అమలు, సీఆర్టీలను, టీచర్లను, ఏఎన్ఎంలను నియమించకపోవడం వంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. దీనంతటికీ మూలం బీజేపీ పాలనా విధానాలేనని స్పష్టం చేశారు. బీజేపీ, టీడీపీ, జనసేన పాలకులకు గిరిజనుల పట్ల ఎటువంటి చిత్తశుద్ధి లేదని, 2014లో ప్రారంభానికి పూనుకున్న గిరిజన యూనివర్సిటీ నేటికీ పూర్తి చేయకపోవడమే అందుకు నిదర్శనమన్నారు. ఆదివాసి దినోత్సవం సందర్భంగా అయినా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గిరిజన యూనివర్సిటీపై స్పష్టమైన హామీ ఇవ్వాలని, గిరిజన ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాలలు పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. రోడ్లు, మంచినీరు, రవాణా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధికారి టి.అఖిల్, జిల్లా కమిటీ సభ్యులు డేవిడ్, సురేష్ పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు వెంటనే చెల్లించండి



ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వేతనదారులు

బలిజిపేట: ఉపాధిహామీ పనులు చేసి నెలలు గడుస్తున్నా నేటికీ డబ్బులు చెల్లించకపోవడంపై వేతనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులతో కలిసి బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు మన్మథరావు మాట్లాడుతూ.. ఒక్కో వేతనదారుడికి 3 నుంచి 6 వారాలకు సంబంధించిన బిల్లులు అందాల్సి ఉందన్నారు. 14 రోజుల లోపు బిల్లులు చెల్లించాల్సి ఉన్నప్పటికీ అధికారులు ఆలస్యం చేస్తుండటంతో వేతనదారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే బిల్లులు చెల్లించాలని, లేదంటే వేతనదారులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బి.భానుమూర్తి, పి.వెంకటస్వామి, జి.బలరాంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జీవామృతంతో చీడపీడల నివారణ



జీవామృతం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బలిజిపేట: జీవామృతం వినియోగంతో పంటలను ఆశించే చీడపీడలను సమర్థవంతంగా నివారించవచ్చని, ఎలాంటి రసాయన ఎరువులు వాడాల్సిన అవసరం లేదని ప్రకృతి వ్యవసాయ విభాగం ఎంఎస్ఆర్పీ లక్ష్మి అన్నారు. వెంగళరాయపురం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఉన్న న్యూట్రీ గార్డెన్‌కు జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. 100 లీటర్ల ద్రవ జీవామృతం తయారీకి 5 లీటర్ల గోమూత్రం, 5 కిలోల దేశీ ఆవుపేడ, ఒక కిలో బెల్లం, శనగపిండి, పిడికెడు పుట్టమన్ను, 100 లీటర్ల నీటిలో కలిపి 5 రోజుల పాటు ప్రతీరోజు ఉదయం, సాయింత్రం సవ్య దిశలో కలపాలని సూచించారు. అనంతరం దాన్ని వడగట్టి వచ్చిన ద్రావణాన్ని జీవామృతంగా వినియోగించుకోవచ్చన్నారు. దీన్ని మొక్కలకు వేసుకుంటే ఎలాంటి ఎరువులు, పురుగు మందులు వినియోగించాల్సిన అవసరం ఉండదన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయుడు ప్రసాద్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చదువులతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

• ఎమ్మెల్యే విజయచంద్ర



ఎమ్మెల్యే విజయచంద్రకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉపాధ్యాయులు

సీతానగరం: విద్యార్థులు విద్యతో పాటు వ్యాయామ విద్య ఎంతో అవసరమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మండలంలోని గాదెలవలస ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శంకరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను బుధవారం ఆయన తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సాహించాలని సూచించారు. నాణ్యమైన బోధన అందించాలని, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యేలా చూడాలన్నారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానన్నారు.

డిప్యూటీ సీఎం దృష్టికి రోడ్ల సమస్య

భామిని: మండలంలోని అధ్వాన రహదారుల దుస్థితిని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు గర్భాన సత్తిబాబు, మండల అధ్యక్షుడు రుంకు కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ, డిప్యూటీ సీఎం వ్యక్తిగత కార్యదర్శి, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ ద్వారా సమస్య విన్నవించామన్నారు.